# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 20-08-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

❖ దేశ ప్రగతిలో సివిల్ సర్వీసెస్ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తోందని ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పేర్కొన్నారు.

❖ భారత్-జపాన్ దేశాల మధ్య సంబంధాలు, ఉమ్మడి ప్రజాస్వామ్య విలువలు పరస్పర గౌరవంతో కొనసాగుతున్నాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

❖ దేశాభివృద్ధిలో దక్షిణ భారతదేశం అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రాంతమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు.

❖ వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చడానికి ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వెల్లడించారు.

=====================

దేశాభివృద్ధిలో సివిల్ సర్వీసెస్ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తోందని ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పేర్కొన్నారు. ఉత్తరాఖండ్‌లోని ముస్సోరీలో ఉన్న లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ లో 2024 బ్యాచ్ IAS శిక్షణార్థుల రెండవ దశ ముగింపు కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రజా సేవ పట్ల సివిల్ సర్వీసెస్ అధికారులు అంకితభావంతో ఉండాలని సూచించారు. తమ పని నిర్ణయాలపై నిబద్ధతతో దృష్టి సారించాలని కోరారు. సమాజ శ్రేయస్సు కోసం కూడా కృషి చేయాలని, సామాన్య ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని పేర్కొన్నారు. దేశమే ప్రథమం అన్న స్ఫూర్తితో ప్రతీ ఒక్కరూ పని చేయాలని ఉపరాష్ట్రపతి కోరారు.

=====================

భారత్ - జపాన్ దేశాల మధ్య సంబంధాలు ఉమ్మడి ప్రజాస్వామ్య విలువలు, పరస్పర గౌరవంతో కొనసాగుతున్నాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. భారత్-జపాన్ రక్షణ మంత్రుల సమావేశం న్యూఢిల్లీలో ఈరోజు జరిగింది. కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్, జపాన్ రక్షణ మంత్రి షింజిరో కోయిజుమి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సముద్ర భద్రతా సహకారంపై ఇద్దరు మంత్రులు అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. ప్రారంభోపన్యాసంలో రాజ్ నాథ్ సింగ్ మాట్లాడుతూ... వచ్చే ఏడాది రెండు దేశాలు 75 ఏళ్ల దౌత్య సంబంధాలను జరుపుకోనున్నాయని తెలిపారు. కేవలం ఇరు దేశాలకే కాకుండా ఇండో-పసిఫిక్ ప్రాంతానికి కూడా విస్తృత ప్రయోజనాలు అందుకునేలా ఈ స్నేహ బంధం నిలిచిందని చెప్పారు. హిందూ, పసిఫిక్ మహా సముద్రాల భద్రత ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

దేశాభివృద్ధిలో దక్షిణ భారతదేశం అత్యంత కీలకమైన ప్రాంతమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. తమిళనాడులోని మహాబలిపురంలో ఈరోజు జరిగిన దక్షిణ ప్రాంతీయ మండలి 31వ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళం రాష్ట్రాల ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు, సి. జోసెఫ్ విజయ్, డి.కె. శివకుమార్, వి.డి. సతీశన్, తెలంగాణా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కె. కైలాష్‌నాథన్, అండమాన్ నికోబార్ దీవుల లెఫ్టినెంట్ గవర్నర్ డి.కె. జోషి, లక్షద్వీప్ అడ్మినిస్ట్రేటర్ ప్రఫుల్ పటేల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ... అధిక అక్షరాస్యత రేటు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు లోతైన సముద్ర వనరుల వినియోగంతో దేశాభివృద్ధిలో దక్షిణ భారతదేశాన్ని అతిపెద్ద భాగస్వామిగా నిలిపాయని అన్నారు. దక్షిణ భారతదేశంలో నీటి పంపిణీకి సంబంధించిన అంశాలపై మరింతగా ఆలోచించాల్సిన అవసరం ఉందని చెప్పారు. పరస్పర చర్చలు, సానుకూల దృక్పథంతో దక్షిణ రాష్ట్రాల మధ్య పెండింగ్‌లో ఉన్న నీటి వివాదాలను వీలైనంత త్వరగా పరిష్కరించుకోవాలని అమిత్ షా సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఢిల్లీలో ఇటీవల జరిగిన విద్యార్థుల నిరసనపై పోలీసు అధికారులు, భద్రతా సిబ్బంది మితిమీరిన బలప్రయోగం చేశారన్న ఆరోపణలు, పోలీసు సిబ్బందిపై జరిగిన హింసను పరిశీలించేందుకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్. సుభాష్ రెడ్డి నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో కూడిన ఉన్నత స్థాయి విచారణ కమిటీని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జోయమాల్య, వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈరోజు ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో పంజాబ్, హర్యానా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి రవిశంకర్ ఝా, ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శాలిందర్ కౌర్, మాజీ సీబీఐ డైరెక్టర్ రిషి కుమార్ శుక్లా, రిటైర్డ్ మేఘాలయ డీజీపీ ఎల్.ఆర్. బిష్ణోయ్ కూడా సభ్యులుగా ఉంటారని తెలిపింది. ఉన్నత స్థాయి విచారణ కమిటీ చేపట్టే విచారణ ఒక్కసారి జరిగే ప్రక్రియ కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నిరంతరంగా, క్రమానుగతంగా సమీక్ష జరపాలని, ఎప్పటికప్పుడు సుప్రీం కోర్టుకు మధ్యంతర నివేదికలను సమర్పించాలని కమిటీని కోరింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

దేశ ఆహార భద్రతకు రైతులే వెన్నెముక అని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాల నుండి వారిని కాపాడటం ప్రభుత్వ బాధ్యతని ఆయన స్పష్టం చేశారు. పాట్నాలోని బీహార్ అగ్రికల్చర్ మేనేజ్‌మెంట్ అండ్ ఎక్స్‌టెన్షన్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (బమెటి)లో ఈరోజు నిర్వహించిన `కృషి జన్ కళ్యాణ్ సంవాద్` కార్యక్రమంలో కేంద్రమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన వరదలు, కరువు, అధిక వర్షపాతం, ఇతర ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే పంట నష్టాల నుండి రైతులకు రక్షణ కల్పిస్తుందన్నారు. పంట నష్టం జరిగితే.. అర్హులైన రైతులకు నష్టపరిహారం అందుతుందని వివరించారు. వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా, పటిష్టంగా మార్చడానికి ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

భారత్-సింగపూర్ మంత్రుల రౌండ్ టేబుల్ (ISMR) 4వ రౌండ్ సమావేశం ఈరోజు సింగపూర్‌లో జరిగింది. ఈ సమావేశంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖల సహాయ మంత్రి జితిన్ ప్రసాద పాల్గొన్నారు. డిజిటల్ టెక్నాలజీ, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సెమీకండక్టర్ సరఫరా గొలుసులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాలన, సైబర్ సెక్యూరిటీ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాలలో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేయడంపై మంత్రులు ఈ సందర్భంగా చర్చలు జరిపారు. ఆధునిక తయారీ, ఫిన్‌టెక్, డిజిటలైజేషన్, ఆరోగ్య సంరక్షణ, సుస్థిరత వంటి రంగాలలో సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింతగా పెంపొందించడమే ఈ చర్చల లక్ష్యమని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ సామాజిక మధ్యమ పోస్ట్‌లో పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

`వందేమాతరం` గీతాన్ని పూర్తిగా కాకుండా కేవలం రెండు చరణాలను మాత్రమే ఆలపించాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీసుకున్న నిర్ణయాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తప్పుపట్టారు. ఈ నిర్ణయం పార్లమెంటు చేసిన చట్టాన్ని బహిరంగంగా ధిక్కరించడమేనని అన్నారు. ఇది దేశ వ్యతిరేక చర్య అని కేంద్రమంత్రి తమిళనాడులో ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ పేర్కొన్నారు. వందేమాతరం 150వ వార్షికోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చారిత్రక తప్పిదాన్ని సరిదిద్ది, ఆ గీతం మొత్తానికి చట్టపరమైన గుర్తింపును కల్పించిందని అమిత్ షా గుర్తు చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 137వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 28వ తేదీ వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = =

దేశాల సరిహద్దు నిర్వహణపై భారత్-నేపాల్ సంయుక్త కార్యవర్గ బృందం 14వ సమావేశం ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో ఈ రోజు ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉన్నత స్థాయి సమావేశంలో పరస్పర ఆసక్తికి సంబంధించిన ఇతర అంశాలతో పాటు సరిహద్దు భద్రత, మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నారు. భారత బృందానికి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ పౌసుమి బసు నాయకత్వం వహిస్తుండగా... నేపాల్ బృందానికి ఆ దేశ హోం మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ ఆనంద్ కఫ్లే నేతృత్వం వహిస్తున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఛత్తీస్‌గఢ్, తూర్పు మధ్యప్రదేశ్‌లో రేపు భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (IMD) పేర్కొంటూ.. ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఉత్తరప్రదేశ్, బీహార్, హిమాచల్ ప్రదేశ్, ఒడిశా, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్, సిక్కిం, పశ్చిమ మధ్యప్రదేశ్ లోని ప్రాంతాలలో రాబోయే రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని IMD అంచనా వేసింది. అలాగే జమ్మూ కాశ్మీర్, లడఖ్, ఈశాన్య రాష్ట్రాలలో కూడా ఇలాంటి పరిస్థితులు నెలకొంటాయని పేర్కొంది. రానున్న మూడు రోజుల్లో అండమాన్ నికోబార్ దీవులు, తూర్పు రాజస్థాన్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురు గాలులు వీస్తాయని IMD వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = =